# సై...కిల్

కథ

బాలి

**''కాఫీతాగి వెళ్లకూడదా నాన్నా! ఎంతలోకి-క్షణంలో చేస్తాను పాలున్నాయి- నువ్వు తెచ్చిన ఇడ్లీలూ ఉన్నాయి''**

**''బయట తాగుతాలే అమ్మా! నాయుడు ఎటన్నా పోతాడేమో అనీ''**

**''సరే నీ ఇష్టం''**

**కనకవల్లి చివరిమెట్టు వరకూ వచ్చి మరీ చెబుతోంది. కామేశ్వర శర్మ చొక్కాకి బొత్తాం పెట్టుకుంటూ ఒకచేత్తో గోడకు చేరేసిన సైకిలును మరో చేత్తో నడిపించుకుంటూ వెళ్లిపోయాడు.**

కామేశ్వర శర్మ తెల్లారి నాలుగింటికే లేచిపోయి ముఖం కడుక్కొని ఫైలాన్ సెంటర్‌కి తన డొక్కు సైకిలుతో చేరుకుంటాడు- అప్పటికే పాల వేన్ వచ్చేస్తుంది. పాల పేకట్లు రెండు ప్లాస్టిక్ సంచుల్లో వేసుకొని వాడిక ఇళ్లల్లో వేసి ఆరు గంటలకు ఇంటికి చేరుకుంటాడు. అప్పటికే అతని చేతిలో ఇడ్లీ పొట్లాం, పాల పాకెట్ ఉంటాయి. కనకవల్లి ఆపాటికే లేచి గిన్నెలు తొల్చి పాలు మరగపెడుతుంది. కామేశ్వర శర్మ స్నానం చేస్తూ- దండెం మీద తడిగుడ్డ ఆరవేస్తున్నా నారాయణ స్తోత్రాన్ని విడవాడు. అప్పుడే మబ్బుల్లోంచి వస్తున్న బాల భానుని రెండు చేతులూ ఎత్తి నమస్కరించుకున్నాక. రెండు ఇడ్లీలు తిని ఇంత కాఫీతాగి, కూతురు కనకవల్లి చెప్పిన విషయాలు శ్రద్ధగా విని డొక్కు సైకిల్‌తో జీవన పోరాటం మొదలెడుతాడు- ఇదీ అతని నిత్యకృత్యం.

కనకవల్లి గదిలోకి పోయి స్టవ్ వెలిగించి పాలు పడేసింది. కాయగూరలు పళ్లెం ముందు వేసుక్కూచుంది. ఓ మాదిరి పెద్ద గది అది. అందులో ఓ మూల వంట- మరో పక్క సామాన్లు సర్దుకున్నారు. నేల మీద పరచిన చాపల మీద, చింకి బొంతలు వేసుకుని జోగులాంబ, మరోపక్క నారాయణ నిద్రపోతున్నారు-

పిట్టగోడకు అవతల రోడ్డు పక్క చిన్న సైజు కాకా హోటలుంది. అందులో పనిచేస్తున్న వాళ్లెపుడో లేచి హడావిడిగా కేకలు వేసుకుంటూ పనులు చేసుకుంటూ ఉంటారు. అట్లకాడతో పెనం మీద కొట్టిన చప్పుళ్లూ, టీ మరుగుతున్న వాసనా- పప్పు రుబ్బుతున్న చప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది. బుట్టెడు ఉల్లిపాయలూ, మిరపకాయలూ తరగడం ఒక పనివాడు పిట్టగోడ ఎక్కి కూనిరాగాలు తీస్తూ పని చేస్తుంటాడు- ఆ చిన్న హోటల్‌కి మధ్యాహ్నం తప్ప అలా బేరాలు ఉంటూనే ఉంటాయి.

ఉదయం ఏడున్నర అవుతోందేమో టైము. జోగులాంబ పెడుతున్న గురక ఆపి కాకా హోటల్‌లోని పనివాళ్ళు వేసే కేకలకి పూర్తిగా తెలివి తెచ్చుకుంది- అయినా లేవబుద్ధి కాలేదు- కాలు దగ్గరగా లాక్కుని వెండిపట్టీ సర్దుకొంది- మెడ ఎత్తి వెనక్కి తిరిగున్న కనకవల్లిని ఉద్దేశించి ''పాలు మరిగాయటే అంది''

కనకవల్లి తల ఆడించింది అవునన్నట్టు

''మీ నాన్న వెళ్లాడా-'' అంది తిరిగి

''ఆc ఎప్పుడో వెళ్లిపోయారు'' అంది కనకవల్లి... పొయ్యిమీద కూర కలుపుతూ

''వెళతాడు- వెళతాడు. ఊళ్లో రాచకార్యాలు చక్కపెట్లాలి కదా!'' అంటూ ''ఇడ్లీ తెచ్చాడా! నా మొహాన్న కాస్త కాఫీ పడేయ్. ముఖం కడుక్కొని వస్తాను'' అంది నిలబడుతూ. కనకవల్లి తల ఆడించింది మామూలుగానే.

పెద్ద ఆవులింతతీసి, తల గొక్కుంటూ- కాలితో చాపనూ, బొంతనూ ఓపక్కకు జరిపి బయటకు నడిచింది జోగులాంబ.

ఇంత కచ్చిక గుండు చేతిలో వేసుకొని పళ్లు తోముకుంటూ వాళ్లింటినీడలో ఉన్న ఎత్తయిన రాయి మీద కూచుంది. పిట్టగోడ మీద కూచుని ఉల్లిపాయలు తరిగే కుర్రాడితో మాటలు కలిపింది- ఆ మాటలు అటూ ఇటూ తిరిగి ఊళ్లో ఆడుతున్న సినిమాల మీదకెళ్లాయి- ఇది ఆమె దిన చర్యలో ఓ భాగం. వాడికేం తోస్తుంది- ఏవో కబుర్లూ కాకరకాయలూ చెప్తాడు. తనూ చెప్తుంది. ఈ దంతధావన క్రియ పదినిముషాల నుండి అరగంటపైగా వెళ్తుంది.

రామన్న పంతులుగారిది ధవళేశ్వరం... ఒకప్పుడు బాగా ఉన్నవారేమోగాని ప్రస్తుతానికి అదేంలేదు.

అబ్ధీకాలతో, కర్మకాండలతో- శివాలయంలో పురాణ పఠనంతో ఇల్లు నేట్టు కొస్తున్నాడాయన. ఎంత కష్టపడుతున్నా దరిద్ర దేవత ఇల్లు వదిలి వెళ్లడం లేదు. భార్య కనకాంబకి ఎప్పుడూ ఏదో ఒక రోగం. కూతుర్నీ కొడుకునీ కన్న తరువాత వాళ్లు కాసింత పెద్దవాళ్లయ్యారేమో కనకాంబ కళ్లుమూసింది- కూతురు అలివేలుమంగ, కొడుకు కామేశ్వర శర్మ- అలివేలు పెళ్లికి ఉన్న ఒక్క గూడూ అమ్మాడు రామన్న పంతులు. అల్లుడిది రాజమండ్రి. ఏదో ఫ్యాక్టరీలో పని- వాళ్లూ అంతంతలో ఉన్నవారే. అలివేలుకి జోగులాంబ పుట్టి దానికి ఏడేళ్లు వచ్చేసరికి అలివేలు భర్త ఏదో యాక్సిడెంట్‌లో పోయాడు. ఆ వార్త విన్న రామన్న పంతులూ హరీ అన్నాడు. ఈ పరిస్థితిలో పుట్టింటికి చేరలేక వాళ్లనీ, వీళ్లనీ మంచి చేసుకొని ఇళ్లలో వంటలు చేస్తూ, నీళ్లు మోస్తూ- విస్తళ్లు కుడుతూ గుట్టుగా పిల్లదాన్ని పెంచుకొస్తోంది.

ధవశేశ్వరంలో ఉన్న కామేశ్వర శర్మ బతుకూ అలాగే ఉంది- కింద లాకుల్లో, గోదావరి కాలవలో మునకెయ్యడం, వడ్డుకురాగానే స్నేహితులు ఇచ్చిన బీడీలు, చుట్టలూ కాల్చడం- ఉన్న చదువు కాస్త అబ్ధీకాలకే గాని మరోలా ముందుకెళ్లక వానాకాలం చదువయిపోయింది. తండ్రి ఉన్నన్నాళ్లూ సంపాదించి ఇద్దరూ ఇంత వండుకొని తినేవారు. తండ్రిపోగానే గాలిపటం బతుకయిపోయింది శర్మది. వయస్సు మూడుపదుల్లోకి అడుగుపెట్టగానే, తన గురించి తాను ఆలోచించేసరికి ఏమీ స్థిరం కనపడలేదు. తండ్రి చేసిన వృత్తే ఎదుపగా కనపడింది- అదీ పెద్దగా తనకు చేతకానిదయ్యింది- తలుపులు మూసుకొని గదిలో తనివి తీరా ఏడ్చాడు- ఇలాగే ఓ మారు జరుగుతుండగా- సరిగ్గా అదే సమయంలో సమస్యకు పరిష్కారమా అన్నట్టు తన చెలికాడు సామర్ల అప్పారావు నాయుడు తలుపుతట్టాడు- ''ఒరేయ్! కాముడూ తలుపు తియ్'' అంటూ-

వంటిమీద మురికి చొక్కాతో కళ్లు వత్తుకొని తలుపు తీశాడు కాముడు- నాయుడ్ని చూడగానే ఇంకా వర్షించాయి కన్నులు. అప్పారావూ, కామే

శ్వర శర్మ చిన్ననాటి నుంచీ ఒకే స్కూలులో చదివినా ఆటలు ఆడినా, కాలవల్లో మునకలు వేసినా అప్పారావు నాయుడు తండ్రి పిల్లవాడ్ని కాలేజీ నెపం మీద చుట్టాలింటికి విశాఖపట్నం పంపాడు- ఇప్పుడు ఏదో ఉద్యోగంలో ప్రమోషన్ రాబోతోంది. ఆ వార్త చెప్పడానికే నాముడు వచ్చాడు- అయితే వీరి మధ్య స్నేహం చెడిపోలేదు. కామేశానికి అప్పారావు సన్నిధిలో అపురూపమయిన స్వాంతన లభిస్తుంది.


కాలం గిర్రున తిరిగిపోతోంది. అలివేలు, తమ్ముడ్ని చూసి కళ్ల నీళ్లు పెట్టుకుంది ఓ రోజు.

''ఏదో ఇంత కడుపుకి తని ప్రాణాలు నిలబెట్టుకుంటున్నా! జోగులాంబను ఓ అయ్యచేతిలో ఎలా పెట్టనురా! నాకు ఏముంది వెనకాల. ఆడ ముండను. నాకు ఏం చేతనవునో- ఏం చేతకాదో నీకు తెలీదా! ఓ ఐదొందలు డబ్బాలో దాచాను- దాని మెడలో ఓ పసుపుకొమ్ము కట్టి నీ దాన్ని చేసుకో!

తాదూర సందులేదు- మెడకోడోలన్నట్టుంది పరిస్థితి-తన స్థితీ- దాని పరిస్థితి అంతే అనుకున్నాడు- ఇప్పటి వరుకూ ఈ దరిద్రంలో మునగ లేదా! ఇక వణుకేమిటి? చలేమిటి? ఎదుట తోబుట్టువు- దాని ముఖం నిండా కన్నీరు-

''ఊc'' అన్నాడు చివరికి

ఊc అన్నాడే గానీ, నిజంగానే వణుకు తన్నుకొచ్చింది- మరో రూపంలో- ఏమంటే జోగులాంబ నిజ స్వరూపంలో- కన్న కూతురు కాబట్టి భరించో, సర్దుకొనో- అది తట్టుకుంది. కాని తనో- జోగులాంబకు చచ్చేటంత కోరికలున్నాయి. అవి తీరలేదన్న కసీ దానికుంది- ఎన్నోసార్లు తనకు అలా పుట్టించిన దేవుడ్ని మనసారా తిట్టింది. ఇప్పటికీ తిడుతుంది. కనపడ్డ తల్లే దానిక్కారణం కాబట్టి ఏ విషయంలోనూ తల్లికి సహకరించదు, జాలి అసలే లేదు. అందుకే చీపురుకట్టతో అలివేలు ఎన్నో సార్లు తన్నులు తిన్నాది. తల్లి ఏమ



యినా తనకనవసరం. వీలయినంత వరకూ శుభ్రంగా తయారయి, తనకు నచ్చిన సిన్మాకల్లా వెళ్లి నేల మీదన్నా కూచుని చూస్తుంది- పోనీ తండ్రిలేని పిల్ల వయసులో ఉంది- ఆ మాత్రం కోరి కలుండవా దానికి నేను- నాకది. పోనీలే నన్ను అన కపోతే ఎవర్ని అంటుంది అని తనలో తనే అలివేలు సర్దుకొంటూనే- పెద్దయ్యాక బాధ్యతలు తెలి యవా- అని మురిసిపోతుంది.

అలివేలు ఎదురుగా ఉన్న కామేశ్వర శర్మ కూడా సరిగ్గా ఇప్పుడు మనసులో అదే అనుకు న్నాడు. ''పెద్దయ్యాక బాధ్యతలు తెలియవా!'' అని గొణుక్కుంటూ ఈ మాటే బయటకూ అన్నాడు ఇల్లుంది. హాల్లో పేపరు చదువుతున్న అప్పారావుకి రోడ్డుమీద సైకిల్ ఓ పక్క పెడుతున్న కామేశ్వర శర్మ కనపడ్డాడు- పేపరు పక్కనపడేసి ''రా రా- కాముడూ అంటూ బయటకి వచ్చాడు అప్పారావు అవీ ఇవీ మాటాడుకుంటుంటే లోపల్నించి ఫలహారాలు వచ్చాయి, అవి ముగించ గానే కామేశ్వర శర్మ ఓ ఐదొందరూపాయలు నాయుడుచేతికి అందిస్తూ ''ఈ మూడు నెలల్లోనూ ఇవి మిగిల్చానురా'' అన్నాడు.

నాయుడు పక్కనున్న బీరువాలోంచి పద్దుల పుస్తకం ఆ మొత్తం అందులో రాసి- ఇప్పటి వరకూ శర్మ ఇచ్చిన మొత్తాన్ని బిజినెస్‌లో పెట్టగా లాభంలో ఎంతవాటా పడుతోందో లెఖ్ఖలు చూసి తీయని సుఖమో, అపరిమిత మయిన శాంతి ఆమెను ఆవహిస్తుంది. అందుకే వారానికి రెండు సిన్మాలన్నా చూడకుండా ఉండలేదు- టీ.వీ.లో కొత్తగా విడుదలయిన సినిమాల గురించి ప్రకటిస్తు న్నారు- ఆమె బుర్రలో ఏదో పురుగు ప్రవేశించి తొలుస్తోంది- తనకు తోడుగా చదువూ సంధ్యాలేని కొడుకు నారాయణ ఉండనే ఉన్నాడు.

మధ్యాహ్నం భోజనాలయాక ఓ కునుకు తీసి లేచి జుట్టును వేళ్లతో దువ్వుకుంటూ ''ఒరేయ్! సిన్మాకు పోదాం రా! దసపల్లాలో ఏదో కొత్త పిక్చర్ వచ్చిం దట-'' అంది కొడుకుతో-

వాడింకా హుషారుగా లేచికూచున్నాడు-

''పెద్దయ్యాక బాధ్యతలు తెలియవా!''

అలివేలు ముఖంచాటంతయ్యింది. జోగు లాంబ కామేశ్వర శర్మ భార్యయిపోయింది- కాని జోగులాంబలో కోర్కెలు పెరుగుతున్నాయే గానీ గొడవలు, గోలలు- వీధి వీధంతా దానినోట్లో నోరు పెట్టలేం బాబూ! అన్న దశకు తీసుకెళ్లింది.

అక్క కళ్లలో వేదన చూడలేక అవునన్నాడు ఆ రోజుల్లో. ''ఇపుడు చేతకాని వెధవ నన్ను పెళ్లా డాడు'' అని నలుగురిలో దుమ్మెత్తిపోస్తోంది జోగు లాంబ. చెప్పినన్నాళ్ళూ మంచిగానే చెప్పాడు- ఇక అసహ్యం వేసి మిన్నకున్నాడు. ఆ వరసలో కనక వల్లి పుట్టింది- నారాయణ పుట్టాడు- తన తల్లి కన కమ్మే పుట్టిందనుకున్నాడు- పోలికలు కలుస్తు న్నాయి- ఇప్పటికే కనకవల్లి తన తల్లే- తండ్రి ఆల నా పాలనా చూస్తుంది చిన్న-పిల్లేగాని ఎంత అణ కువ- కుప్పపోసిన మంచితనం- ఇక నారాయణ గాలివాటు పిల్లాడు. తల్లి చేరువలో చదువులో సున్నా- ఇకవాడెలా బతుకుతాడో భగవత్ నిర్ణయం.

కామేశ్వర శర్మ చెప్పినవన్నీ విన్నాడు అప్పా రావు ''అరేయ్ కాముడూ ధవళేశ్వరం, రాజమండ్రీ కాదుగానీ విశాఖపట్నం వచ్చేయ్-'' అన్నాడు, నాయుడి సహాయ సహకారులున్నాయి తనకి. అలా నాయుడు మాటకాదనక విశాఖపట్నం ముప్పాలపాలెం చేరుకున్నాడు- అప్పట్లో అది అభి వృద్ధి చెందుతున్న ప్రాంతం. అలాగని అప్పారావు భుజం మీద చేరబడిపోవడం తన కిష్టంలేదు. ఉదయం పాల పాకెట్‌లు వేసే, కొత్తగా ఇల్లుకట్టుకు న్నవారి పద్దులు రాసి, తండ్రితో వస్తున్న కులవృత్తి చేసి- సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. జోగులాంబ తనకు సహకరిస్తే ఎంత బావుణ్ణని రోజుకి పదిసా ర్లన్నా ఆ పరమాత్ముడికి చెప్పుకుంటాడు. అయినా ఫరవాలేదు. కనకవల్లిని శుభ్రమైన ఓ అయ్యచేతిలో పెట్టడమే కావలసింది. దానికే పైసా పైసా పోగేస్తు న్నాడు. అనూచానంగా వస్తున్న శాపాలూ, దరిద్రం తన బిడ్డకు అంటకూడదు.

వెంకోజీ పాలెంలో అప్పారావు నాయుడు రెండు లక్షలు అయ్యాయని చెప్పాడు- శర్మ ముఖం వెలిగిపోయింది. రుమాలుతో కళ్లతుడుచుకొంటూ ''నిన్నుచూసే బతుకుతున్నాన్రా నాయుడూ- పిల్ల దాన్ని సలక్షణంగా అత్తారింటికి పంపాలి'' అన్నాడు. ''అన్నీ హాయిగా అవుతాయి- నువ్వేం దిగులుపడకు అంతేనా- అదీ నా కూతురే- దాని పెళ్లినాటికి అంతకు నాలుగింతలు చెయ్యనూ'' అన్నాడు నాయుడు. శర్మ లేచి నిలబడ్డాడు- ఇక వెళ్తాను అన్నట్టు ''జోగులాంబ- అది మూర్ఖురాలు, నీ కష్టం, నీ త్యాగం దానికి అర్థం కాదు- ఇది జీవితం... తప్పదు-'' నాయుడు గుమ్మం వరకూ వస్తూ అన్నాడు. కామేశ్వర శర్మ మనస్సు ఆనం దంగా వెలిగిపోయింది సైకిల్ అందుకున్నాడు.

జోగులాంబ ముఖం కడగడం అయ్యింది- స్నానం కూడా కానిచ్చి కూతురిచ్చిన రెండు ఇడ్లీలు, కాఫీతాగి ఇంకా నేల మీద దొర్లుతున్న నారాయణ ''లే వెధవా! మొద్దు నిద్రా వీడున్నూ''- అని లే లే...తె ల్లారిపోయిందని లేపికూచోపెట్టి వంట ఎంతవరకు వచ్చిందని కూతుర్ని పరామర్శించి ఓ పదినిముషాలు వీధి గుమ్మంలో తచ్చాడి'' దిక్కుమాలిన కొంప దిక్కు మాలిన కొంపనీ... ఏమీ తోచదు... ఓ రేడియో లేదూ- ఓ టీ.వీ అన్నా లేదు'' అంటూ అరుగు దిగి ఆ వరుసలో నాలుగో ఇంటివేపు అడుగేసింది. ఆ ఇంటికి పోతే జోగులాంబకు మంచి కాలక్షేపం. రాత్రి పదకొండు వరకూ టీ.వీ చూసుకోవచ్చు-

మరి కాసేపటికి నారాయణ కాఫీ తాగి అటే పరుగెత్తాడు. టీ.వీ. సీరియళ్లలోని నటులు వేసు కున్న ప్రతి నగా, కట్టుకున్న ప్రతి చీర జోగులాం బను ఇట్టే ఆకర్షిస్తాయ్! ఏ ఏ సీరియళ్లలో ఏ ఏ నటులు, నటీమణులున్నారో కళ్ళు మూసుకొని చెప్పగలదు. తీరుబడిగా కూచుంటే ఆ రంగుల ప్రపంచం కళ్ల ముందు మెదిలి... తన దీన స్థితితో బేరీజు అయి మనసు అదోలా అయిపోతోంది- ఇక సిన్మాహాల్లో అయితే ఆ చీకటిలో కూచున్న రెండు గంటలు వెండితెర మీద వెలుగులకే మనసు మొద్దు బారి ఓ ఊహా జగత్తులోకి తీసుకుపోయి తానే ఆక్ష ణలో అందులోని హీరోయిన్ అయిపోతుంది. ఏదో

''అవునే! నేనూ అదే అనుకుంటున్నాను. బావుం దట- తెగ నవ్వట'' ''సరే! పోయి మీ నాన్న ఎక్క డున్నాడో చూడు ముందర. డబ్బులు పట్రా- వస్తూనే నాకో వక్కపొట్లాం తెచ్చిపెట్టు అన్నట్టు కాస్త డబ్బులు ఎక్కువే తిసుకరా! హాల్లోకి దూర గానే నీ కాకలొకటి చస్తుంది''

''నువ్వు పెద్ద తిననట్టు''

''తొరగా రావాలి. టైమయిపోతోంది. నా మతి మండినట్టే ఉంది. ఇప్పుడు గుర్తొచ్చింది'' కుచ్చిళ్ళు దులిపి తిరిగి కట్టుకుంది. పావుగంటలో నారాయణ వగర్చుతూ వచ్చాడు- డబ్బులు దొరికినట్టువాడి ముఖమే చెప్తోంది- వాళ్లమ్మ మీదికి వక్కపొట్లాం విసిరాడు. కొంచెం ముందుకు వంగి కూతురుతో సిన్మాకు పోతున్నాం అనిచెప్పి, చెప్పులు వేసుకొంది జోగులాంబ.

ఇద్దరూ మెట్లు దిగారు. జోగులాంబ ఆనం దంగా ఉంది. ''మీ నాన్న గొణుక్కున్నాడా ఏమిటి రా'' అంది హుషారుగా అడుగులేస్తూ.

ముందు ఇవ్వనన్నాడే- తిట్టుకున్నాడు-జేబు లోంచి తీసి కొంచెం- ఆ పక్కవాడ్ని అడిగి మరో పదిరూపాయలు ఇచ్చాడు-

''ఇంతకీ ఎక్కడున్నాడట''

''పార్క్ లేదూ- ఆ పక్కనే మేడ కడుతున్నారు కదా! దానికి ఇటుకలు ఎత్తుతున్నాడు-''

''వీడి అప్రాచ్యం కూలా! బాపన పుటుకపుట్టి ఇటుకలు ఎత్తుతున్నాడ్రా- గీర్వాణం చదివేట్ట- గీర్వాణం... గీర్వాణం [illegible]సికి కూడు పెట్టడం లేదూ. సర్లే వాడిచావేదో వాడ్ని చావనీ- తొందరగా అడు గులు వెయ్- మళ్లా [illegible] దొరకదు-''

నారాయణ కడ[illegible] సాగుతూ- ముందుకు పరుగెత్తుతున్నాడు- వెనక జోగులాంబ చచ్చీచెడి బస్ దొరకపుచ్చుకొని సిన్మాహాల్లోకి చొరబడ్డారి ద్దరూ- సిన్మాబాగానే ఉంది. జోగులాంబ అందులో లీనమయిపోయింది. రెండు గంటల కాలక్షేపం- ఇంటికి పోతే ఊహలు కరిగిపోతాయి- పాత మొగుడు- పాత జ్ఞాపకాలున్నూ-

ఎపుడూ శ్రమతో అలసిపోయిన ముఖమూ-

నలిగి మాసిపోయిన ఖద్దరు బట్టలూ, శుక్రవారము- మంగళవారమూ అంటూ పెంచుకుంటున్న దరిద్రపు గెడ్డమూ వెధవ ముఖమూ వీడిన్నూ. నా తల్లి ముండ చేసింది ఇదంతా- ఓ సుఖమా శాంతా!! మనస్సులో అగ్ని గుండాలు బద్దలవుతోంటే హోల్లోంచి బయటపడింది- రోడ్డెక్కేక ఇంకా ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న నారాయణ గాడి భుజం చరిచింది.

అది నారాయణకు గుర్తే- వెనక్కి తిరిగిచూడకుండా సిటీ బస్‌స్టేండ్‌వేపు పరుగులు తీశాడు వాడు. బస్‌గాని వస్తే నలుగురి మధ్యలోంచి దూరి జోగులాంబకి సీటు రిజర్వ్ చేసి ఉంచవచ్చు. తల్లీ కొడుకులిద్దరూ ఇంటికి చేరేసరికి- బీడీ కాలుస్తూ చీకటిలో గుమ్మంలో కూచున్నాడు కామేశ్వర శర్మ- వస్తున్న కోపం, దుఃఖాన్ని అలాగే దిగమింగుకున్నాడు. వారానికి రెండు సినిమాలు- వెనక ఖర్చులూ- ఇదేమిటే జోగులూ అంటే, తిట్లూ, దీవెనలూ ఏడుపులూ- ఇల్లంతా నరకంగా మారడం క్షణంలో-

ఛీ. ఛీ... అనుకుంటూ బీడీని దూరంగా విసిరి అరుగు దిగి వెళ్ళిపోయాడు.

జోగులాంబ గదిలోకి వెళ్లింది- ఏదో పుస్తకం చదువుతూ, వంటచేస్తున్న కనకవల్లిని ఏదో అడిగింది. చెంగుతో ముఖం తుడుచుకుంటూ బయటకు వచ్చి ''ఒరేయ్ పదరా! ఆ టీ.వీ.యే చూసొద్దాం- మంచి సీరియల్ అయిపోతోంది. ఇంకా వంటకాలేదట'' నారాయణతో చెప్తూ ఆ నాలుగో ఇంటివేపు అడుగేసింది జోగులాంబ. అలా వెళ్లిందంటే ఏ పది గంటల తరవాతో ఇంటికి చేరుతాదన్న మాట!

ఓ రోజు ఉదయం తొమ్మిదిగంటలవుతుందేమో! దిక్కుమాలిన సైకిల్ కిర్రూ...కిర్రూ శబ్దమూ- ఏమయ్యిందో ఏమిటో- పది రూపాయిలిచ్చి బాగుచేయించలేడు- ఆ పది రూపాయలు తనకు ఎక్కువ. తన బతుకులాంటిదే ఈ సైకిల్- అయితే అదే తన మిత్రుడు. ఎంత సహాయం చేస్తోంది. ఎంత సహకారం అందిస్తోందీ. కందెనలో కొంచెం కొబ్బరినూనె వేస్తేచాలు- దాన్ని తిట్టడం తప్పు-

''అమ్మా! కనకవల్లీ!! నూనె సీసా తేచ్చిపెట్టు తల్లీ''- పాత గుడ్డముక్కతో సైకిలంతా తుడుస్తూ అడిగాడు- పైన ఎండమండిపోతోంది. ఉక్కకు చెమట నుదుటి నుండి కనుబొమల మధ్య ఉంచిన కుంకుమను చెరుపుతూ కారుతోంటే పైగుడ్డతో తుడుచుకొని- టర్నర్ స్క్రూతో నట్టు బిగిస్తున్నాడు.

కనకవల్లి చిరిగిన లంగా కుట్టుకుంటూ మధ్యలో లేచివెళ్లి నూనె సీసా తండ్రి పక్కన పెట్టి తిరిగివచ్చి సూదీ దారం అందుకుంది. గుమ్మానికి ఓ పక్కన కూచున్న జోగులాంబ, జంతిక ముక్కలు నోట్లో కుక్కుకొని కర్రూ కర్రూ మనిపిస్తున్న నారాయణకేదో కళ్లతో సంజ్ఞచేసింది- వాడు అంత గడుసుగానే కళ్లతోనే ఊఁకొట్టి ''అమ్మా! ఇవాళ కొత్త సిన్మా వస్తోందే- ప్రభాతేలోనట- ఎంతో బావుంటుందట'' వీలయినంత హెచ్చుసర్వంతో అన్నాడు.

''ముష్టి ముండను- నన్నుడగుతావేం వెధవా? పో- పోయి నీ బాబునడుగు- అడుగో వాకిట్లో ఉన్నాడు గా'' అంది నిష్ఠూరంగా.

కామేశ్వర శర్మ విన్నాడు- విననట్టే పనిచేసుకొంటున్నాడు. నారాయణ ఒక్కగెంతులో వాళ్ళ నాన్న ముందు వాలాడు.

''కొత్త సిన్మా అట- బాగుందట'' దీర్ఘాలు తీశాడు.

''చదువూ-సంధ్యలేని వెధవా- ఎంతసేపూ సినీమాలూ నువ్వునూ''

అంతే! సమయం కోసం చూస్తున్న జోగులాంబ అందుకుంది, ''అదొక్కటే మనకి తక్కువయ్యింది వెధవా!- ఓ అచ్చటా- ఓ ముచ్చటా లేదు. చంటిగుంటడు నోరువిడిచి అడిగాడన్న కనికరమన్నా లేదు. అయినా ఒకప్పుడు ఉండి చస్తేనా- ఇపుడు లేదనుకోడానికి- ఓ పది రూపాయిలు వాడి ముఖాన్న పుట్టలేదు, పిల్లలన్న తర్వాత ఆమాత్రం అడగకపోతారా?-''

''అమ్మా మొన్ననే కదటే వెళ్లాడు'' కనకవల్లి అంది.

''నువ్వూరుకోముండా! పెద్ద ఆరిందవయిపోయావ్ కొంపలో-''

కూతుర్ని అంతమాట అనడంతో కామేశ్వర శర్మకు కడుపు రగిలిపోయింది- తన నిస్సహాయితకు అసహ్యం వేసింది. నోరువిప్పాలనీ, ఏదో చెప్పాలనిపిస్తోంది. కానీ తాను మాటాడితే ఇంకా రెచ్చిపోతుంది.

''...మా అమ్మచేసింది. నాకింతకన్న గొప్ప మొగుడు దొరకడనీ- దరిద్రపుముండా. దాని దరిద్రమంతా నా నెత్తిన పెట్టి మరీ వెళ్లింది... దాని పిండం పిచికలు తినా! అంతా దానిశ్రాద్ధం. మా నాన్న నన్నొదిలి బతకలేనూ. వీడొక త్యాగపురుషుడని బయలుదేరాడు. వట్టి చవట- పెళ్లాం పిల్లల కోరికలు తీర్చలేనివాడు ఓ మొగుడే! దరిద్రుడు. వీడెపుడు ఛస్తాడో! ఈ దరిద్రం...'' ఆ అరుపులకి ఆ తిట్లకీ హద్దులేకుండా పోతోంది. బూతులూ- కేకలూ నెత్తిబాదుకోడాలూ-

ఇంట్లో ఏనాడూ శాంతిలేదు,

స్థంబానికి చేరబడి ఏమీ ఎరగని వాడిలా జంతిక ముక్కలు నములుతున్నాడు నారాయణ

కామేశ్వర శర్మ కళ్లలో నీళ్లు తిరిగాయి-

''ఇపుడేమయ్యిందే జోగులూ! మమ్మల్ని ఇలా తినేస్తున్నావేమిటే- నీకు బాధ్యత లేదూ'' అన్నాడు చివరకు. నెత్తీనోరూ బాదుకొంటున్న జోగులాంబకు ఇంకా తిక్కరేగిపోయింది'' నాకు బాధ్యత లేదంటావేం రా వెధవా! నిన్ను కంటెలడిగానా, కాసులడిగానా? ఈ నూలు పోగేకదా నా మెడలో- ఈ నూలు గుడ్డలే కదా నా వంటిమీద. ఏం పట్టు చీరలు ఇచ్చావురా దరిద్రుడా! నిన్ను- నిన్ను కట్టుకొని ఏం సుఖపడుతున్నానురా వెధవా! ఏమిటో కూస్తున్నావు- నాకు బాధ్యత లేదూ- లేదంటావురా- జోగులాంబ గబుక్కున పైకి లేచింది. గబ గబా మెట్లు దిగింది. శివమెత్తిన దానిలా ఊగిపోతోంది.

''ఇది నా ఖర్మ... నా ప్రారబ్ధం!'' మనసులో పదే పదే అనుకుంటున్న కామేశ్వర శర్మ కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి-

''అమ్మా!- అమ్మో- ఏమిటే?'' అంటూ కంగారుగా కేక పెట్టింది కనకవల్లి వాకిట్లో కి చూసి

''నాన్నా!'' అని చేతిలోని సూదిని, లంగాను దూరంగా విసిరి గావుకేక పెట్టేలోపల జోగులాంబ వాకిట్లోని పెద్ద రాయిని బలంగా రెండు చేతులతోనూ ఎత్తి వెనక వాటుగా తన పని తాను చేసుకొంటున్న కామేశ్వర శర్మ నెత్తి మీద శక్తి కొద్దీ కొట్టింది-

''చావు వెధవా! పీడా విరగడవుతుంది!''

''నాన్నా!'' కనకవల్లి మెట్లుదిగి పిల్చి కేకవేసి గుండెలవిసి పోతుంటే అటు పరుగెత్తింది.

కామేశ్వర శర్మ నెత్తి పగిలిపోయింది. చేతిలోని స్క్రూ డ్రయివర్ ఎడమ కాలిలో దిగబడిపోయింది. భుజం మీద చెవిపక్కగా నెత్తురు కాలువ కడుతూ సర్రున విరజిమ్మింది- చిందిన రక్తం నేల మీద మట్టిలో మడుగులు కడుతోంది-

సైకిలు మరో పక్క వొరిగిపోయింది.

చెమట, కన్నీరు, రక్తం అతని కళ్లను తడుపుతోంటే, మసకగా కనకవల్లి కనపడుతోంది చేతివేళ్లు కొట్టుకొని కొట్టుకొని ఆగాయి- కుడికాలు ఇంకా ఇసకలో గడ్డిలో కొట్టుకోంటోంది.

నాన్నా! నాన్నా- అమ్మో!! మా అమ్మ మా నాన్నను చంపేసింది దేవుడోయ్- మా నాన్న చచ్చిపోతున్నాడు. నాన్నా!- ఏ మండీ- ఇటురారూ-'' కనకవల్లి పిచ్చిగా అరుస్తూ రోడ్డు మీదకూ సైకిల్ దగ్గరకూ పరుగులు తీస్తోంది.

ఎవరెవరో హోటల్ కుర్రాళ్లు పరుగెత్తి వచ్చారు. నెత్తురు చిందకుండా కట్లు కడుతున్నారు-

డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లండి- అని ఎవరో అరిస్తే... ఇంకెవరో రిక్షాకోసం పరుగులు తీశారు.

ఇంటి నీడలో కూచున్న జోగులాంబ కాలి మీద ఎక్కుతున్న చీమను ఫటేల్న చేత్తో చరచి- వెండి పట్టీని సరిగ్గా సర్దుకొని ''ఛావనీ వెధవని'' అని గొణిగి ఖాండ్రించి ఊమ్మింది నేల మీద.

★

## సల్మాన్‌కు బిపాసా చెక్



బాలీవుడ్ తారలకు స్టేజిషోలలో ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. అసలు సినిమాల కన్నా స్టేజీషోలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారన్న సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ మొన్నా మధ్య 'సహారా స్టార్' వాళ్లతో ఓ ఒప్పందం కుదుర్చుకున్నాడు! ఆ ఒప్పందం ప్రకారం డిసెంబర్ 31న వాళ్లకి ఒక ప్రోగ్రాం ఇవ్వాలి. ఆ రోజున సల్మాన్‌తో పాటు బాలీవుడ్ స్టార్స్ అర్బాజ్, సోహైల్, మలైకా అరోరా కూడా తళుక్కుమంటారు. సల్మాన్ ఈ కార్యక్రమానికి గాను 3కోట్లు డిమాండ్ చేశాడు. ఈమొత్తం వినగానే ప్రోగ్రాం నిర్వాహకులు కళ్లు తేలేసారు. బేరసారాలు చేసి రెండున్నర కోట్లు ఇవ్వడానికి సహారా వారు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే సల్మాన్ వారు చెప్పిన రేటుకి ఒప్పుకోలేదు. దాంతో సల్మాన్‌తో తెగతెంపులు చేసుకొని బిపాసాను సంప్రదించారు. బిపాసా కోటి రూపాయలకే వారికి ఓకే చెప్పిందట! ఇదిలా ఉండగా బిపాసా గత సంవత్సరం డిసెంబర్ 31న జె.డబ్ల్యు మరియోట్ వాళ్లు ఏర్పాటు చేసిన షోకు హాజరై ముప్ఫై నిమిషాలకు గానూ 90లక్షలు తీసుకుంది.